సాక్షి ఒడిశా
సోమవారం । 10 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,16,000లు, బంగారం 150 మిల్లీగ్రాములు,వెండి 47 గ్రాముల 750 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



10.33 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం

అక్రమంగా తరలిస్తున్న 10.33 క్వింటాళ్ల గంజాయిని ఆర్.ఉదయగిరి, మోహనా బ్లాక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులను అరెస్టు చేశారు.

- 2లో



వైభవంగా బిరిపాణి జాతర

ఆదివాసీలు ప్రధానంగా జరుపుకొనే పండగల్లో బిరిపాణి జాతర ఒకటి. ఈ ఏడాది కూడా జయపురం సమితి గొడపోదర్‌లో ఘనంగా జాతర నిర్వహించారు.

- 2లో

న్యూస్‌రీల్

రాహుల్ గాంధీని కలిసిన కొరాపుట్ ఎంపీ



రాహుల్‌తో ఎంపీ సప్తగిరి ఉల్క

కొరాపుట్: కాంగ్రెస్‌కు చెందిన కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్క పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీని కలిశారు. ఆదివారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాలులో ఉన్న ఉల్కను చూసి రాహుల్ పేరు పెట్టి పలకరించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉల్కను సోనియా గాంధీ వద్దకు తీసుకెళ్లగా ఆమె అభినందనలు తెలిపారు. ఒడిశా రాష్ట్రం నుంచి సప్తగిరి ఉల్క ఒక్కరే కాంగ్రెస్ తరఫున ఎంపీగా గెలుపొందడం విశేషం. 2019లోనూ ఆ పార్టీ తరఫున ఉల్క ఒక్కరే రాష్ట్రం నుంచి గెలుపొందారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పరిశీలకునిగా ఉన్న ఉల్కకు మరింత పదోన్నతి లభిస్తుందని పార్టీలో ప్రచారం జరుగుతోంది.

డివైడర్‌ను ఢీకొన్న బొలెరో



ప్రమాదానికి గురైన వాహనం

రాయగడ: స్థానిక పాతగేట్ వద్ద డివైడర్‌ను బొలేరో అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగిపోయి తీగలు చెల్లాచెదురుగాపడ్డాయి. ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం నుంచి కూరగాయల లోడ్‌తో జేకేపూర్ వైపు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ తీగలను సరిచేశారు. దీంతో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు.

ట్రాక్టర్ ఢీకొని మహిళకు గాయాలు



మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రాయగడ: స్కూటీపై వెళ్తుండగా వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. కళ్యాణసింగుపూర్‌లో ఆదివారం జరిగిన ఈ ఘటనలో గాయపడిన మహిళ దేవగిరి గ్రామానికి చెందిన గంగా హుయికగా గుర్తించారు. వెంటనే బాధితురాలిని కళ్యాణసింగుపూర్ ఆస్పత్రికి అంబులెన్సులో తరలించారు. మార్కెట్‌కు వెళ్తుండగా మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

రూ.60 వేలు విలువైన కలప స్వాధీనం



స్వాధీనం చేసుకున్న చెక్కలతో అటవీ సిబ్బంది

మల్కన్‌గిరి : జిల్లాలోని కోరుకొండ సమితి నక్కమామ్ముడి పంచాయతీ దుమ్మురిపోదర్ గ్రామంలో శనివారం రాత్రి అక్రమ రవాణాకు సిద్ధం చేసిన కలపను అటవీ శాఖాధికారులు పట్టుకున్నారు. ఈ ప్రాంతం నుంచి నిత్యం అక్రమ కలప రవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు ప్రత్యేక బృందం దాడులు చేపట్టింది. రూ.60 వేలు విలువైన 25 చెక్కలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

రాజకీయాలకు సెలవు

- ప్రకటించిన వి.కె.పాండియన్
- బీజేడీ ఓటమి పట్ల క్షమాపణలు
- పార్టీకి నష్టం కలిగించినందుకు విచారం



భువనేశ్వర్: రాష్ట్ర రాజకీయాల్లో ప్రభంజనం సృష్టించిన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అత్యంత సన్నిహిత విశ్వాసపాత్రుడు వి.కార్తికేయ పాండియన్ ప్రత్యక్ష రాజకీయాల నుంచి విరమిస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. బిజు జనతా దళ్ పాలనా వ్యవహారాల్లో ఆయన అత్యంత శక్తివంతమైన వ్యూహకర్తగా వెలుగొందారు. కొద్ది నెలల క్రితం ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) ఉద్యోగం నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకుని ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగిడిన ఏడు నెలల స్వల్ప నిడివిలోనే రాజకీయాలకు దూరమవుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేడీ ఓటమికి క్షమాపణలు చెప్పారు. ఆయన పట్ల జరుగుతున్న ప్రచారం పార్టీకి నష్టం కలిగించినందుకు విచారం వ్యక్తం చేశారు. బిజు పరివారం, కార్యకర్తలకు క్షమాపణ కోరారు. నవీన్ పట్నాయక్‌కు సాయం చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని స్పష్టం చేశారు.

పదవులను ఆశించలేదు..

పాండియన్ మాట్లాడుతూ తాను రాజకీయాల్లో పదవుల కోసం ఆశపడలేదని చెప్పారు. బీజేడీలో సైతం ఎలాంటి పదవి చేపట్టలేదని గుర్తు చేశారు. ఎన్నికల్లో సైతం పోటీ చేయలేదన్నారు. గత 12 ఏళ్లలో ఒడిశా అభివృద్ధి కోసం ప్రతిరోజూ తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు నిర్విరామంగా శ్రమించానని తెలిపారు. బిజు బాబు కలలు సాకారం చేసేందుకు ఆయన తనయుడు నవీన్ పట్నాయక్ ఎప్పటి నుంచో ప్రయత్నిస్తున్నారని, రాజకీయాల్లో ఏ పని చేసినా ఒడిశా, నవీన్ పట్నాయక్‌ల కోసమేనని పునరుద్ఘాటించారు. ఉద్యోగ జీవితంలో సంపాదించుకున్న ఆస్తులు లేవన్నారు. పిత్రార్జిత ఆస్తి తప్ప ప్రపంచంలో ఎక్కడా ఆస్తి లేదనిప్రకటించారు. ఐఏఎస్ రంగంలో అడుగుపెట్టినప్పుడు ప్రకటించిన ఆస్తులే ఇప్పటికీ కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. తానెప్పుడూ ఒడిశాను హృదయంలో పదిలపరచుకుంటానని, తన గురువు నవీన్ బాబును తుదిశ్వాస వరకు మర్చిపోనని చెప్పారు. వారి శ్రేయస్సు కోసం జగన్నాథుడిని ప్రార్థిస్తానని తెలిపారు. క్రీడాభివృద్ధి, మహిళా సాధికారత రంగంలో నవీన్ కృషి ఓ మైలురాయిగా అభివర్ణించారు. కరోనా సమయంలో 30 జిల్లాలను సందర్శించి ఆరోగ్య సంబంధిత వ్యవస్థను అధ్యయనం చేసినట్లు పాండియన్ గుర్తు చేశారు.

ప్రజలకు చేరువగా..

వి.కె.పాండియన్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జిల్లా మేజిస్ట్రేట్‌గా పని చేశారు. జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్నప్పుడు ఒడిశా ప్రజలకు చేరువయ్యారు. ప్రతిచోటా ప్రజల కోసం పని చేయడానికి ప్రయత్నించారు. 12 ఏళ్ల కిందటే ముఖ్యమంత్రి కార్యాలయంలో చేరారు. ఒడిశాపై నవీన్ దృక్పథం అమలు చేయడానికి నిరవధికంగా ప్రయత్నించినట్లు వీడియో సందేశంలో ప్రసారం చేశారు. విద్య, వైద్యం, పేదరిక నిర్మూలన రంగాల్లో కృషికి పెద్ద పీట వేశారు. సార్వత్రిక ఎన్నికల్లో బిజు జనతా దళ్ (బీజేడీ) అధ్యక్షుడు నవీన్ పట్నాయక్, వీకే పాండియన్‌లు స్టార్ క్యాంపెయినర్లుగా తళుక్కుమన్న విషయం తెలిసిందే. ఎన్నికల సభలు, రోడ్ షోలలో ఇరువురు నేతలు ఓటర్లను విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కార్తీక్ పాండియన్ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు బహిరంగంగానే సవాల్ విసిరారు. జూన్ 9న నవీన్ పట్నాయక్ 75 శాతం ఆధిక్యతతో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. అన్నట్టుగానే ఆయన ఆదివారం రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించడం విశేషం.

ముచ్చటగా ముగ్గురు

- మోదీ కొలువులో మంత్రులుగా ధర్మేంద్ర ప్రధాన్, అశ్విని వైష్ణవ్, జుయెల్ ఓరం
- దేశ రాజధానిలో ప్రమాణ స్వీకారం

భువనేశ్వర్: కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలో ఏర్పాటైన మూడో విడత కొలువులో రాష్ట్రం నుంచి ముగ్గురు ప్రముఖులకు స్థానం లభించింది. వీరిలో ధర్మేంద్ర ప్రధాన్, జుయెల్ ఓరం, అశ్విని వైష్ణవ్ ఉన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం రాష్ట్రానికి చెందిన ముగ్గురు బీజేపీ నేతలకు తన మంత్రివర్గంలో చోటు కల్పించారు.

- సంబల్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి బిజు జనతా దళ్ సంస్థాగత కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్ దాస్‌పై విజయం సాధించిన బీజేపీ సీనియర్ నాయకుడు ధర్మేంద్ర ప్రధాన్ మోదీ 3.0 కొలువులో క్యాబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ గతంలో మోదీ క్యాబినెట్‌లో సహజ వాయువు, పెట్రోలియం మంత్రి, ఉక్కు మంత్రి, విద్యా శాఖ మంత్రి హోదాలో విజయవంతంగా బాధ్యతలు నిర్వహించారు.
- సుందర్‌గఢ్ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న జుయల్ ఓరం 12, 13, 14వ లోక్‌సభ, 16వ లోక్‌సభలో సభ్యునిగా కొనసాగారు. ఈసారి ప్రధాని నరేంద్ర మోదీ కేబినెట్ మంత్రుల్లో ఒకరిగా ఎంపికై ప్రమాణ స్వీకారం చేశారు.
- మాజీ ఐఏఎస్ అశ్విని వైష్ణవ్ 39వ రైల్వే మంత్రిగా, 55వ కమ్యూనికేషన్స్ మంత్రిగా, 2022-24 మధ్య కాలంలో భారత ప్రభుత్వంలో ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2019 నుంచి ఒడిశాకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యసభ సభ్యుడు. అంతకు ముందు 1994లో, వైష్ణవ్ ఒడిశా కేడర్‌లోని ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) అధికారి. రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఆదివారం మోదీ కేబినెట్ 3.0లో కేబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.



ధర్మేంద్ర ప్రధాన్



జుయెల్ ఓరం



అశ్విని వైష్ణవ్

బీడీ గోదాం దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి ఎం.వి.3 గ్రామం వద్ద బీడీ గోదాములో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. శనివారం రాత్రి రెండు గంటల సమయంలోనూ మంటలు చెలరేగడంతో సిబ్బంది వెంటనే ఆర్పివేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేస్తుండగా ఆదివారం మధ్యాహ్నం మరోసారి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో రూ.4 కోట్ల ఆస్తి నష్టం వాటిల్లింది. గోదాం యజమాని గోపాల్ స్కిదర్ ఫిర్యాదు మేరకు మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫామ్‌హౌస్‌కు వచ్చి.. పనస చెట్టెక్కి..



పనస చెట్టెక్కిన ఎలుగుబంటి

కొరాపుట్: ఆకలితో ఉన్న ఓ ఎలుగుబంటి ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి బొత్రాచిమిని గ్రామంలో బబులీ మిత్రాకు చెందిన ఫామ్‌హౌస్‌లో చొరబడింది. అక్కడున్న పనస చెట్టు ఎక్కి ఎంచక్కా పండు తెంచి తొనలుగా ఒలుచుకుని మరీ ఆకలి తీర్చుకుంది. తినడానికి సౌకర్యంగా లేకపోవడంతో కిందకు మిగతా పనస పండు తిని వెళ్లిపోయింది. ఇటీవలే ఈ గ్రామంలో ఎలుగుబంటి దాడిలో ఓ వ్యక్తి చనిపోయాడు. అప్పట్లో ఎలుగును గ్రామస్తులు చంపేశారు. తాజాగా మరో ఎలుగుబంటి గ్రామంలోకి రావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన మహిళలు

కొరాపుట్: తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి దెవులా గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామంలో రెండు వేల మంది జనాభా ఉండగా కేవలం 22 గొట్టపు బావులు ఉన్నాయి. అందులో 10 పని చేయడం లేదు. మిగిలిన వాటిలో మురుగునీరు వస్తుండటంతో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. దీంతో నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రం నుంచి కొసాగుమ్డ సమితి కేంద్రం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. వందలాది వాహనాలు వెనక్కి మళ్లిపోతున్నాయి. సంబంధిత అధికారులు సైతం గ్రామస్తుల వద్దకు వెళ్లడానికి వెనుకడుగు వేస్తున్నారు.

ప్రత్యక్ష రాజకీయాలకు స్వస్తి



అచ్యుత్ సామంత

భువనేశ్వర్: బిజు జనతా దళ్ నేతల్లో ఒకరైన, కంధమల్ ఎంపీ అచ్యుత్ సామంత ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకున్నారు. ఆదివాం నుంచే రాజకీయాలకు విరామం ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో శనివారం బిజు జనతా దళ్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను ఆయన నివాసంలో కలిసి తన అభిప్రాయం వ్యక్తం చేశారు. తనకు రాజ్యసభ, లోక్ సభకు అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. 32 ఏళ్లుగా తాను కొనసాగిస్తున్న సామాజిక సేవ నిర్విరామంగా కొనసాగుతుందని, ఈ సామాజిక సేవను మరింత విస్తరింపజేస్తానని స్పష్టం చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో కంధమల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఆయన ఓటమి పాలయ్యారు. ఈ సందర్భంగా అచ్యుత సామంత కంధమల్ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రజల ప్రేమకు కృతజ్ఞతలు తెలిపారు. కిట్, కిస్ వ్యవస్థాపకుడు, భారతీయ జనతా పార్టీకి చెందిన సుకాంత పాణిగ్రాహి చేతిలో 2,1371 ఓట్ల తేడాతో సామంత ఓడిపోయారు. 2019లో అచ్యుత్ సామంత తన సమీప ప్రత్యర్థి బీజేపీకి చెందిన ఖారవేళ స్వంయిపై 1,49,216 ఓట్ల భారీ తేడాతో విజయం సాధించారు.

బీజేపీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారం వాయిదా

- తొలుత ఈ నెల 10న నిర్వహించాలని నిర్ణయం
- తాజాగా 12న నిర్వహణ



మీడియాతో మాట్లాడుతున్న విజయ్‌పాల్ సింగ్ తోమర్

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పాటు కానున్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవం ఈ నెల 12వ తేదీకి వాయిదా పడిందని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి విజయ్‌పాల్ సింగ్ తోమర్ ప్రకటించారు. లోగడ ఈ నెల 10న ప్రమాణ స్వీకారోత్సవం జరుగుతుందని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త ముఖ్యమంత్రి ఎవరనే ఉత్కంఠ కొనసాగుతోంది. స్థానిక బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన పార్టీ నేతల కీలక సమావేశం తీర్మానం ప్రకారం ప్రమాణస్వీకారోత్సవం వాయిదా పడిందని బీజేపీ అధికార ప్రతినిధి జతిన్ మహంతి మీడియాకు తెలిపారు. అయితే ముఖ్యమంత్రి పదవికి పార్టీ ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదని స్పష్టం చేశారు. 10న జరగాల్సిన బీజేపీ శాసన సభా పక్ష సమావేశం జూన్ 11న జరగనుందని చెప్పారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఆమోదించిన అభ్యర్థిని బీజేపీ శాసనసభా పక్ష సమావేశం తమ నాయకుడిగా (ముఖ్యమంత్రి) ఎన్నుకుంటుందన్నారు. కాగా, ముఖ్యమంత్రి పదవికి ప్రధాన పోటీదారులలో ధర్మేంద్ర ప్రధాన్, కనక వర్ధన్ సింగ్ దేవ్, మోహన్ మాఝీ, మన్మోహన్ సామల్ ఉన్నారు. తాజాగా బీజేపీ సీనియర్ నేత, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే సురేష్ పూజారి కూడా రేసులో ఉన్నారు. గత లోక్‌సభలో బర్‌గఢ్‌కు ప్రాతినిధ్యం వహించిన సురేష్ పూజారి ఇటీవల ముగిసిన ఎన్నికలలో బ్రజరాజ్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. మరోవైపు బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడుగా కొనసాగుతున్న మన్మోహన్ సామల్ తాజాగా ముగిసిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయినా ఆయన ముఖ్యమంత్రి పదవి కోసం ఆరాటపడుతుండడం చర్చనీయాంశమైంది. నరేంద్ర మోదీ ఆశీర్వాదం అనుకూలిస్తే ఆయనకు ముఖ్యమంత్రి పదవి వరించడం పెద్ద కష్టం కాదనే ప్రచారం సాగుతోంది.మరోవైపు ముఖ్యమంత్రి పదవి కోసం తహతహలాడిన ధర్మేంద్ర ప్రధాన్ ఆదివారం జరిగిన కేంద్ర మంత్రి మండలిలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో ఆయన రేసు నుంచి తొలగినట్లే. ఈ నేపథ్యంలో బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపికపై స్పష్టత రావాలంటే మరో రెండు రోజులు ఆగాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్ మీడియాతో అన్నారు. స్థానిక జనతా మైదాన్‌లో జరగనున్న బీజేపీ మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కొత్త కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖులు హాజరవుతారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఉసిరి.. ఉసూరు!

- ఔషధ గుణాలు గల చెట్ల నరికివేత
- మండిపడుతున్న పర్యావరణవేత్తలు

రాయగడ :

స్థానిక కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో విలువైన ఔషధ గుణాలు గల ఉసిరి జాతికి చెందిన 60 చెట్లను నరికివేశారు. కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఓ కార్యాలయాన్ని నిర్మించేందుకు ఈ చెట్లను నరికివేయడం పట్ల వృక్ష ప్రేమికులు మండిపడుతున్నారు. ఓవైపు జిల్లా అటవీ శాఖ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలంటూ ప్రజల్లో చైతన్యపరిచి వివిధ ప్రాంతాల్లో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుడుతుంటే మరోవైపు విలువైన ఔషధ గుణాలు గల ఉసిరి జాతికి చెందిన వృక్షాలను అంతమొందించడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో కలెక్టర్ కార్యాలయంలో ఉసిరి, వేప వంటి ఔషధ గుణాలు గల వృక్షాలను స్వయంగా జిల్లా యంత్రాంగమే నాటింది. నేడు అభివృద్ధి పేరిట వాటిని నరికివేయడం ఎంతవరకు సమంజసమని పర్యావరణ అభిమానులు ప్రశ్నిస్తున్నారు.



యంత్రాల ద్వారా మొక్కలను ధ్వంసం చేస్తున్న దృశ్యం



విలువైన ఉసిరి మొక్కల దుంగలు




నరికి వేతకు గురైన ఉసిరి చెట్టు



కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో మిగిలి ఉన్న ఔషధ వృక్షాలు

క్లుప్తంగా

ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి!



బీజేపీ ఎమ్మెల్యే నిత్యానంద గొండో

కొరాపుట్‌: నబరంగ్‌పూర్‌ జిల్లా ఉమ్మర్‌కోట ఎమ్మెల్యేగా గెలుపొందిన నిత్యానంద గొండోకి నూతన మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశముంది. అవిభక్త కొరాపుట్‌ జిల్లాల నుంచి బీజేపీ తరఫున గెలుపొందిన వారిలో నిత్యానంద ఒక్కరే రెండుసార్లు వరుసగా గెలుపొందారు. మిగతా వారందరూ తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టనున్న వారే. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువు తీరిన ప్రతిసారి అవిభక్త కొరాపుట్‌ జిల్లాలకు మంత్రి పదవి దక్కుతోంది. 2000, 2004 సంవత్సరాలలో బీజేపీ, బీజేడీ కూటమి ప్రభుత్వాలు కొలువు తీరినప్పుడు ఈ జిల్లాలకు ఒక్కో పార్టీ తరఫున ఒక్కో మంత్రి పదవి దక్కేది. ఈసారి బీజేపీ ఒంటరిగానే అధికారంలోకి వచ్చింది. దీంతో ఈ జిల్లాలకు మంత్రి పదవులు ఒకటి కంటే ఎక్కువ వచ్చే అవకాశం ఉంది. 2019లో నిత్యానంద గెలుపొందినప్పుడు అవిభక్త కొరాపుట్‌ జిల్లాల్లో బీజేపీ బలోపేతానికి కృషి చేశారు. ఈ నేపథ్యంలో నిత్యాకు ఉప ముఖ్యమంత్రి గానీ, క్యాబినెట్‌ మంత్రి హోదాగానీ వస్తుందని పార్టీ సీనియర్లు ఇప్పటికే హామీ ఇచ్చినట్లు తెలిసింది. నిత్యా వర్గీయులు ఇప్పటికే రాజధానిలో మకాం వేశారు.

ముకుంద పాఢి రచనలు అజరామరం



అదనపు కలెక్టర్‌ దాస్‌ను సత్కరిస్తున్న ముకుందపాఢి కుటుంబసభ్యులు

పర్లాకిమిడి: కవి ముకుంద పాఢి రచనలు ఒడియా సాహిత్యంలో ఉన్నత శిఖరాలు అందుకున్నాయని జిల్లా అదనపు కలెక్టర్‌ (రెవెన్యూ) బిరేంద్ర కుమార్‌ దాస్‌ అన్నారు. ఒడ్డి మంగళివీధిలోని ఉత్కళ హితేషిణీ భవనంలో ఆదివారం ముకుంద పాఢి చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి నివాళులు అర్పించారు. గౌరవ అతిథిగా పూర్ణచంద్ర మహాపాత్రో, సెంచూరియన్‌ వర్సిటీ (జట్నీ క్యాంపస్‌) ఇంజినీరు జగన్నాథ పాఢి, జాతీయ అవార్డు గ్రహీత ఉపాధ్యాయురాలు ఆశాలతా పాణిగ్రాహి, జిల్లా సాంస్కృతిక అధికారి అర్చనా మంగరాజ్‌, ఉత్కళ హితేషిణీ సమాజ్‌ అధ్యక్షుడు భరత్‌భూషన్‌ మహంతి, భాగవత్‌ పాఢి (కార్యదర్శి), సుబ్రాంశు శేఖర్‌ పట్నాయక్‌, మమతా పాఢి పాల్గొన్నారు.

విరగకాసిన మునగ



పలాస: ఉద్దానం ప్రాంతంలో ఔషధ గుణాలు కలిగి మంచి పౌష్టికాహారమైన మునగ ఈ వేసవిలో విరగ కాసింది. ఈ ప్రాంతంలో జీడి మామిడి తోటల్లో, కొబ్బరి తోటల్లో అంతర పంటగా రైతులు సాగు చేస్తున్నారు. ఏటా మూడు కాలాల్లో ఈ పంట కాపునకు వస్తోంది. ఈ వేసవిలో మునగ బాగా కాసి, దిగుబడి వచ్చినా తగిన విధంగా రైతుకు గిట్టుబాటు కావడం లేదు. ఈ మునగ కాయలకు, మునగ ఆకులకు మార్కెట్‌లో మంచి డిమాండ్‌ ఉన్నప్పటికీ దళారీల వల్ల రైతులకు తగిన లాభాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు నేరుగా పలాస కాశీబుగ్గ పట్టణంలో అమ్ముకోవడానికి రైతు బజారు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

14న ప్రపంచ రక్తదాన దినోత్సవం

శ్రీకాకుళం కల్చరల్‌: రెడ్‌క్రాస్‌ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14న ప్రపంచ రక్తదాన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్‌ చైర్మన్‌ పి.జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 13న జిల్లాలోని విద్యార్థులకు రక్తదానంపై యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీ రెడ్‌క్రాస్‌ నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమ పేర్లను 12వ తేదీలోగా రెడ్‌క్రాస్‌ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

నృత్య పోటీల్లో ప్రతిభ చాటిన చిన్నారులు

సోంపేట: సోంపేట పట్టణంలోని శ్రీనటరాజ్‌ నాట్య అకాడమీ చిన్నారులు పూరి నృత్యోత్సవాల్లో పాల్గొని ప్రతిభ చాటారు. భారత్‌ ఆర్ట్స్‌ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం పూరిలో నృత్యపోటీలు నిర్వహించారు. నటరాజ్‌ నాట్య అకాడమీ విద్యార్థులు ఆశ్రీత, రోషివిక, జాను, మహా పాల్గొని ప్రదర్శన ఇచ్చారు. ప్రతిభ చాటిన చిన్నారులకు నిర్వాహకులు విజయ్‌కుమార్‌ సాహు తదితరులు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.



పర్వత కనుమ వద్ద దేవికి పూజలు చేస్తున్న పూజారి



గొడొపొదర్‌లో బిరిపాణి దేవి మందిరం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం



: బిరిపాణి జాతరలో పాల్గొన్న భక్తులు

వైభవంగా బిరిపాణి జాతర



కొండపైన దేవికి పూజలు చేస్తున్న దృశ్యం

ఆదివాసీలు ప్రధానంగా జరుపుకొనే పండగల్లో బిరిపాణి జాతర ఒకటి. ఈ ఏడాది వర్షాలు, ఏ పంటలు వేస్తే ఎక్కువ దిగుబడులు వస్తాయి తదితర అంశాలు తెలుసుకునేందుకు ఈ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించి అంచనా వేసి వెల్లడిస్తారు. ఆ విషయాలు తెలుసుకునేందుకు అనేక ఆదివాసీ గ్రామాల నుంచి బిరిపాణి జాతర జరిగే జయపురం సమితి గొడపోదర్‌ గ్రామానికి తరలివస్తారు. ఈ ఏడాది కూడా శనివారం వేలాదిమంది సమక్షంలో గొడొపొదర్‌ గ్రామంలో బిరిపాణి జాతర ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామం మధ్య ఉన్న బిరిపాణి దేవి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి సమీపంలో ఉన్న కొండపైకి వెళ్లి కలుగు వద్ద దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నీటి మట్టాన్ని బట్టి వర్షపాతాన్ని అంచనా వేశారు. భక్తులంతా బిలం నుంచి వచ్చే నీటిని సీసాల్లో పట్టి తమ వెంట తీసుకెళ్లారు. ఈ పండగ రెండు శతాబ్దాలుగా జరుగుతోందని పంచాయితీ సర్పంచ్‌, పూజారి బుద్ధు తెలిపారు.

-జయపురం



సీసాల్లోకి బిలం నీటిని పడుతున్న భక్తులు



బిరిపాణి కొండపైకి దేవిని తీసుకెళ్తున్న పూజారులు


ట్రాక్‌మేన్ల సౌకర్యాలకు ఉద్యమం



కొత్త కార్యవర్గంతో శ్రామిక్‌ కాంగ్రెస్‌ ప్రముఖులు

భువనేశ్వర్‌: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దారోడ్‌ మండలం పరిధిలో ట్రాక్‌మేన్ల సంక్షేమానికి సకల సౌకర్యాల్ని అందుబాటులోకి తెచ్చేందుకు శ్రామిక్‌ కాంగ్రెస్‌ ఉద్యమిస్తుందని మండల సమన్వయకర్త ఇన్‌చార్జి సునీల్‌ కుమార్‌ భంజ్‌ తెలిపారు. బలుగాంవ్‌ వరకు విస్తరించిన కలుపడా శాఖ తొలి శాఖా మండలి సమావేశం ఆదివారం నిర్వహించారు. కేంద్ర కార్యవర్గ సభ్యుడు సుబ్రత్‌ పండా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సునీల్‌ కుమార్‌ భంజ్‌ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ట్రాక్‌మేన్లకు తాగు నీరు, పహరా ప్రాంగణాల్లో విశ్రాంతి గదుల నిర్మాణం ప్రధాన డిమాండ్లుగా పేర్కొన్నారు. ఈ మేరకు రైల్వే యాజమాన్యంతో ఇటీవల జరిగిన సంప్రదింపుల సమావేశంలో సానుకూల కార్యాచరణకు ఒప్పందం కుదిరినట్లు ప్రకటించారు. విస్తరించిన కలుపడా శాఖ కొత్త కార్యదర్శి అజిత్‌ కుమార్‌ తొరాయ్‌, ఫిరోజ్‌ కుమార్‌ పరిదాకు ప్రత్యేకంగా సత్కరించి అభినందించారని మీడియా వ్యవహారాల ఇంచార్జి లక్ష్మీధర మహంతి తెలిపారు. కార్యక్రమంలో 400 మంది పైబడి కార్యకర్తలు పాల్గొన్నారు.

● వికసిత్‌ భారత్‌



భారత ప్రధాన మంత్రిగా వరుసగా మూడో సారి ప్రమాణస్వీకారం చేసిన నరేంద్ర మోదీకి ప్రముఖ సైకత శిల్పి సుదర్శన పట్నాయక్‌ పూరీ సాగర తీరంలో సైకత శిల్పంతో శుభాకాంక్షలు తెలియజేశారు. వికసిత్‌ భారత్‌ నినాదంతో రూపు దిద్దుకున్న ఈ శిల్పం సందర్శకులను ఆకట్టుకుంది. - భువనేశ్వర్‌

పోలీస్‌ స్టేషన్‌ టు అసెంబ్లీ

- కానిస్టేబుల్‌ నుంచి ఎమ్మెల్యేలుగా గెలుపు
- ప్రజాసేవ లక్ష్యంతో ఉద్యోగాలకు రాజీనామా
- మంచి మెజార్టీతో విజయం

కొరాపుట్‌: సాధారణంగా పోలీస్‌శాఖలో కానిస్టేబుల్‌ స్థాయి వ్యక్తులు రాజకీయాల్లోకి రావడం అరుదు. అందులోనూ ఉద్యోగ విరమణ తర్వాత రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉంది. కానీ ఉద్యోగంలో యువ స్థాయిలో ఉన్నప్పుడే రాజీనామా చేసి గెలుపొందడం విశేషమే. అలా నబరంగ్‌పూర్‌, జయపూర్‌ అసెంబ్లీ స్థానాలలో ఇద్దరు కానిస్టేబుళ్లు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. నబరంగ్‌పూర్‌ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా బీజేపీ తరఫున గెలుపొందిన గౌరీశంకర్‌ మజ్జి కానిస్టేబుల్‌. రాజకీయాలపై ఆసక్తితో ఉద్యోగానికి రాజీనామా చేసి 2019లో బీజేపీ తరఫున నబరంగ్‌పూర్‌ స్థానం నుండి పోటీ చేసి ఓడి పోయారు. అయినా పట్టువిడవకుండా 2024లో మళ్లీ పోటీ చేసి గెలుపొందారు. దాంతో తన జీవిత ఆశయం నెరవేర్చుకున్నారు. కొరాపుట్‌ జిల్లా జయపూర్‌ ఎమ్మెల్యే తారా ప్రసాద్‌ బాహీనిపతి కాంగ్రెస్‌ తరఫున గెలుపొందారు. ఈయన కూడా కానిస్టేబుల్‌గానే జీవిత ప్రస్థానం ప్రారంభించారు. తొలిసారిగా రాష్ట్రంలో



నబరంగ్‌పూర్‌ ఎమ్మెల్యే గౌరీశంకర్‌ మజ్జి

కానిస్టేబుళ్ల సంఘం ఏర్పాటు చేశారు. సంఘం ఏర్పాటు సమయంలో ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్‌ ఆగ్రహానికి గురయ్యారు. దాంతో తారా ఉద్యోగం ఊడింది. అయినప్పటికీ కోర్టుకి వెళ్లి మళ్లీ ఉద్యోగంలో చేరారు. మళ్లీ సంఘం ఏర్పాటు చేసి ఉద్యోగం పోగొట్టుకున్నారు. మళ్లీ కోర్టు నుంచి ఆర్డర్‌ లెటర్‌ ఇచ్చి జాయిన్‌ అవ్వడం, సంఘం ఏర్పాటు చేయడం పలుమార్లు జరిగింది. ఇది గమనించిన విపక్ష నాయకుడు జేబీ పట్నాయక్‌ తారాని పిలిపించి



జయపూర్‌ ఎమ్మెల్యే తారాప్రసాద్‌ బాహీణీ పతి

కొరాపుట్‌లో కాంగ్రెస్‌ ఎమ్మెల్యేగా టిక్కెట్‌ ఇచ్చారు. అక్కడ 2000, 2004లలో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో కొరాపుట్‌ స్థానం నియోజకవర్గాల పునర్విభజన చట్టం వల్ల గిరిజనులకు కేటాయించారు. దాంతో తారా జయపూర్‌కు మకాం మార్చారు. అక్కడ కాంగ్రెస్‌ టిక్కెట్‌ లభించకపోవడంతో బీజేపీ టికెట్‌పై పోటీ చేసి ఓడిపోయారు. తిరిగి 2014, 2019, 2024లలో జయపూర్‌ నుంచి కాంగ్రెస్‌ టిక్కెట్‌పై గెలుపొందారు.

10.33 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఎస్పీ స్వాతి ఎస్‌.కుమార్‌, ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ ఆదేశాల మేరకు ఆర్‌.ఉదయగిరి, మోహనా బ్లాక్‌ పోలీసులు కమలాపూర్‌ నాకా వద్ద పెట్రోలింగ్‌ జరుపుతుండగా ఉత్తర్‌ ప్రదేశ్‌కు చెందిన ట్రక్కును స్వాధీనం చేసుకున్నారు. అందులో అక్రమంగా తరలిస్తున్న 7.58 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకుని ముఠాను అరెస్టు చేశారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.1.5 కోట్లు ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఇద్దరు నిందితులు మహమ్మద్‌ ఆలీ, తస్లీంషాను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అదేవిధంగా రామగిరి నుంచి అక్రమంగా ఇన్నోవా కారులో తరలిస్తున్న గంజాయిని ఎక్సైజు, పోలీసు అధికారులు పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి 2.75 క్వింటాళ్లు ఉంటుందని ఆర్‌.ఉదయగిరి ఎస్‌ఐ తెలిపారు. ఈ కేసులో రామగిరికి చెందిన సుధాంశు బోరాడోను అరెస్టు చేసి ఆర్‌.ఉదయగిరి కోర్టులో హాజరుపరిచారు.

రంగస్థల కథానాయిక





తిరుపతిలో మహానటి సావిత్రి పురస్కారం అందుకుంటున్న రాజేశ్వరి

- 35 ఏళ్లుగా కళాసేవ చేస్తున్న రాజేశ్వరి
- విధి వ్రాత నాటిక ద్వారా కళారంగ ప్రవేశం
- 4వేలకు పైగా ప్రదర్శనలు
- ముత్యాలమ్మ కళానికేతన్‌ ద్వారా పరిషత్‌ల నిర్వహణ

శ్రీకాకుళం కల్చరల్‌: రంగస్థలం ఆమెను పెంచి పోషించింది. నటన ఆమె జీవితమైపోయింది. నాటక ప్రదర్శన జీవిత పరమార్థమైంది. సమాజంలోని మంచి చెడులను, అన్యాయాలను ఎత్తి చూపేందుకు చక్కటి వేదిక నాటకం. పౌరాణిక నాటకాలు పురాణ గాథలకు ప్రతి రూపాలు కాగా, సాంఘిక, జానపద నాటకాలు వర్తమాన సమస్యలకు దర్పణాలు. పట్టణంలోని గుజరాతీపేటలో నివాసం ఉంటున్న కేశిరెడ్డి రాజేశ్వరి గత 35ఏళ్లుగా నాటక రంగానికి సేవలు అందిస్తున్నారు. నాటి తరానికి చెందిన హీరోయిన్‌ పాత్రలకు ఇద్దరు మాత్రమే నటీమణులు ఈ ప్రాంతంలో ఉన్నారు.

ఆమె కోసం..

రాజేశ్వరి స్వగ్రామం ఒడిశా రాష్ట్రంలోని కాశీనగర్‌ గ్రామం. కాగా ఈమె కళారంగంలోనే మేకప్‌ ఆర్టిస్టుగా ఉన్న శ్రీకాకుళం నగరానికి చెందిన శ్యామ్‌కుమార్‌ను వివాహం చేసుకున్నారు. మొదటగా తన 11 ఏళ్ల వయసులో విధివ్రాత నాటకంతో ప్రవేశం జరిగింది. పౌరాణిక, సాంఘిక నాటకాలలో చంద్రమతి, చింతామణి, బాలనాగమ్మ, సంగు, తార, చిత్రాంగి పాత్రలు పోషించారు. 4వేలకు పైగా సాంఘిక, పౌరాణిక ప్రదర్శనల్లో నటించారు. సినీ దర్శకులు, నిర్మాత ఆర్‌.నారాయణమూర్తి సినిమాలైన మార్కెట్‌లో ప్రజాస్వామ్యం, ఎర్రసముద్రంలో నటించారు. అలాగే ఇటీవల జయమ్మ పంచాయతీ, కన్యాకుమారి, పెళ్లయ్యింది కానీ సినిమాలలో నటించారు. అక్షరం శరణం గచ్ఛామి, తులసి తీర్థం, భారతమాత, సాయి మహిమలు, తిరుపతమ్మకథ, ఇదండి మా ఆయన సంగతి, పార్థవ, చిగురాకు, ఆమె ఓ కథ టీవీ సీరియళ్లలో కూడా నటించారు.

ఉత్తమ అవార్డులు

2006లో మృగం నాటికకు నంది అవార్డు, చట్టి పూర్ణయ్యపంతులు అవార్డు, తిరుపతిలో జేసీస్‌ తరఫున అవుట్‌ స్టాండింగ్‌ అవార్డు, తిరుపతిలో గరుడా అవార్డు, కళాజగతి అవార్డుతో పాటు ఎన్నో అందుకున్నారు. 150కి పైగా ఉత్తమ బహుమతులు అందుకున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'కందుకూరి' పురస్కారాన్ని కూడా అందుకున్నారు. కర్రి రంగారావు స్మారక పురస్కారం, సుబ్బరాజు కళాపరిషత్‌ ద్వారా 'మహానటి సావిత్రి' పురస్కారాన్ని అందుకున్నారు.

● నందిని శత్పతికి నివాళి



రాష్ట్ర ఏకైక మహిళా ముఖ్యమంత్రి నందిని శత్పతి 93వ జయంతి పురస్కరించుకుని పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. భువనేశ్వర్‌ నగరంలో ఆమె విగ్రహం వద్ద పార్టీలకు అతీతంగా వివిధ పార్టీల ప్రముఖులు, సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో చేరుకుని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆమె కుమారుడు మాజీ ఎంపీ తథాగత శత్పతి, కుటుంబీకులు పాల్గొన్నారు. – భువనేశ్వర్‌

న్యూస్‌రీల్

దొంగల బీభత్సం

● 25 తులాల బంగారం, నగదు చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వివరాలు సేకరిస్తున్న ఎస్సై యు.మహేష్

గజపతినగరం: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై అగ్నిమాక శాఖ కార్యాలయం సమీపంలో నివాసంలో ఉంటున్న ఓఇంట్లో దొంగలు చొరబడి బంగారం, నగదు అపహరించారు. శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. బుడ్డెపు తిరుపతి రావు అనే వక్తి ఇటీవల కుటుంబంతో తీర్థయాత్రలకు వెళ్లాడు. ఇంటి బాధ్యతలను వరుసకు మేనమామ అయిన నాగరాజుకు అప్పగించాడు. ఈ క్రమంలో నాగరాజు తన పనులు ముగించుకుని తిరుపతి రావు ఇంటిని చూసేందుకు వచ్చిన సమయంలో తలుపులు పగలగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి తిరుపతిరావుకు వెంటనే సమాచారం అందించాడు. దీంతో బాధితుడు హుటాహుటిని ఇంటికి వచ్చి పరిశీలించి సుమారు 25తులాల బంగారం, లక్ష రూపాయల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై యు.మహేష్ సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్‌పై గడ్డి దగ్ధం



ట్రాక్టర్‌లో మంటలు అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో గడ్డితో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తగిలి షార్ట్ సర్క్యూట్ అవడంతో ట్రాక్టర్‌లో ఉన్న గడ్డి అగ్నికి ఆహుతైంది. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది ఎస్.ఎఫ్ మదీనా, ఎల్.ఎఫ్ ఆర్.వెంకటరావు, ఫైర్‌మెన్ ఎస్.వెంకటేశ్వర్రావు, జిరాము తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేయడం వల్ల ప్రమాదం తప్పింది. అగ్ని ప్రమాదాన్ని గుర్తించిన ట్రాక్టర్ డ్రైవర్ చాకచక్యంగా ఖాళీస్థలంలో ట్రాక్టర్‌ను నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పినందుకు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



వెండి మంటపం వద్ద పట్టాభిషేక మహోత్సవం జరిపిస్తున్న అర్చక స్వాములు

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో సుందరాకాండ హవనం జరిపించారు. అనంతరం వెండి మంటపంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



క్రికెట్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన పీస్ ఎటాకర్స్ జట్టుతో ఎస్సై సూర్యకుమారి

భోగాపురం: యువత అన్ని రంగాల్లో రాణించాలని, అప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎస్సై సూర్యకుమారి తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఎస్సై సూర్యకుమారి ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీల్లో గెలుపొందిన ప్రథమ జట్టు విజేతలకు రూ.25 వేలు, ద్వితీయ జట్టు విజేతలకు రూ. 15 వేలు నగదు అందజేశారు. అదేవిధంగా బ్యాటింగ్‌లో అత్యధిక పరుగులు సాధించిన చిన్నికి మ్యాన్ ఆఫ్ ది సిరీస్, అత్యధిక వికెట్లు తీసిన అశోక్‌కు ప్రత్యేక బహుమతులు అందజేశారు. మ్యాచ్‌ల నిర్వాహకులను ఆమె అభినందించారు.

జూదరుల అరెస్ట్

పార్వతీపురం టౌన్: మండలంలోని లక్ష్మీనారాయణ గ్రామ సమీపంలో పేకాటాడుతున్న ఏడుగురిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్సై దినకర్ తెలిపారు. నిందితుల నుంచి 1,20,535 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అతి వినియోగం అనర్థం..

● జిల్లాలో యాంటీబయాటిక్స్ వాడకం అధికం
● జలుబు, దగ్గు వంటి వాటికి కూడా ఇవే మాత్రలు..
● కిడ్నీ ,లివర్ వ్యాధుల బారిన పడుతున్న జనం



యాంటీ బయాటిక్స్ మందులు

విజయనగరం ఫోర్ట్ : యాంటీ బయాటిక్స్ మందులను జనం అధికంగా మింగేస్తున్నారు. జిల్లాలో వీటి వినియోగం బాగా పెరిగింది. చిన్నపాటి జలుబు, దగ్గు వంటి వాటికి కూడా ప్రజలు యాంటీబయాటిక్స్ వాడుతున్నారు. కొంతమంది ఆర్ఎంపీలు చీటికి, మాటికీ యాంటిబయాటిక్స్ ఇవ్వడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు కిడ్నీ, లివర్ వంటి వ్యాధుల బారిన పడతున్నారు. యాంటీ బయాటిక్స్ అధిక మోతాదులో వాడడం వల్ల బ్యాక్టీరియాలు సైతం ఆ మందులకు అలవాటు పడి.. జబ్బులు తగ్గడం లేదు. దీంతో రోగులు రోజుల తరబడి మంచం పట్టాల్సి వస్తోంది. వీటి వల్ల శరీరంలో సహజసిద్ధంగా ఉండే రోగ నిరోధక శక్తి దెబ్బతింటోంది. యాంటీ బయాటిక్స్ అధిక వినియోగంపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

చిన్న రోగాలకు కూడా..

పట్టణం, పల్లె అనే తేడా లేకుండా యాంటీబయాటిక్స్ మందులు అధికంగా వినియోగిస్తున్నారు. కొంతమంది ఆర్ఎంపీల వద్ద తీసుకోగా , మరి కొంతమంది మందుల దుకాణాల వద్ద నేరుగా తెచ్చుకుని వాడుతున్నారు. జలుబు, దగ్గు, జ్వరం, తలనొప్పి, నడుంనొప్పి, చర్మ వ్యాధులు ఇలా ఏ జబ్బుకైనా యాంటీబయాటిక్స్ తెగ వాడేస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి యాంటీబయాటిక్స్ వాడాల్సి ఉంది. కాని చాలా మంది సొంత వైద్యం చేసుకుంటున్నారు. దీంతో కిడ్నీ, కాలేయ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు.

జిల్లాలో 1200 మందుల దుకాణాలు

జిల్లాలో సుమారు 1200 మందుల దుకాణాలున్నాయి. ఏడాదికి సుమారు 50 లక్షలకు పైగా యాంటీబయాటిక్స్ మాత్రలను జనం వాడుతున్నారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే దుకాణదారులు మందులు విక్రయించేస్తున్నారు. ప్రిస్కిప్షన్ లేకుండా మందులు అమ్మకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ ఎక్కడా అమలు కావడం లేదు.

అధిక వినియోగం తగదు..



నొప్పి నివారణ మందులు ఎక్కువుగా వాడితే ప్రమాదమే. ఫ్లోరోసిస్ వల్ల నొప్పులు ఎక్కువుగా ఉంటాయి. నొప్పి నివారణకు వాడే మందుల వల్ల కిడ్నీలు పాడయ్యే ప్రమాదం ఎక్కువుగా ఉంది. అదేవిధంగా కొన్ని రకాల యాంటీబయాటిక్స్ ఎక్కువుగా వాడడం వల్ల కిడ్నీలు పాడయ్యే అవకాశం ఉంది. కొన్ని రకాల ఇంజిక్షన్లు కిడ్నీలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. వైద్యుని సలహా లేకుండా ఎటువంటి యాంటిబయాటిక్స్ వాడకూడదు.

– డాక్టర్ జి. మురళీకృష్ణ, ఎస్‌సీడీ విభాగం వైద్యాధికారి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

ఘాట్ రోడ్డుపై ఆటో బోల్తా

● పలువురికి గాయాలు



బోల్తా పడిన ఆటో



సంఘటనా స్థలంలో క్షతగాత్రులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పెదఖర్జ మలుపులో ప్రయాణికులతో వస్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. వివరాల్లోకి వెళితే... మండలంలోని లుంబేస్ పంచాయతీ లప్పటి గ్రామనికి చెందిన పలువురు గోరటి గ్రామంలో శనివారం జరిగిన శుభకార్యానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వస్తుండగా గోరటి ఘాట్‌రోడ్డుపై ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చంద్రయ్య, అర్చన, సనారమ్మ, చెల్లమ్మ, లక్ష్మమ్మ, సన్యాసి, గుంజారావు, గౌరి, సోమయ్య, సుందరరావు, సునీత, మాధవరావు, అవనిక, కళావతిలకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను తాడికొండ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు చికిత్స అందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పోస్టుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఎన్. ప్రేమ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య సంస్థల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ బాధ్యతలు నిర్వహిస్తున్న వారు అర్హులని పేర్కొన్నారు. నియామకం పొందిన వారు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శిగా రెండేళ్ల పాటు కొనసాగుతారన్నారు. రెండు సంవత్సరాల కాల వ్యవధిలో పదవీ విరమణ పొందేందుకు సిద్ధంగా ఉన్న ఉపాధ్యాయులు అనర్హులని తెలిపారు. అలాగే గతంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శిగా పనిచేసి ఉండకూడదని, సీసీఏ నిబంధనల ప్రకారం ఎటువంటి క్రమశిక్షణా చర్యలు ఉండకూడదన్నారు. అర్హత, ఆసక్తి గల వ్యాయామ ఉపాధ్యాయులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉప విద్యాశాఖ అధికారి కౌంటర్ సైన్‌తో కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

పేరు	ఊరు	రిజర్వేషన్ ర్యాంక్	జాతీయ ర్యాంక్
మజ్జి రిషివర్ధన్	పోరాం	04(ఓబీసీ కేటగిరీ)	59
ధనుకొండ శ్రీనిధి	విజయనగరం	43	326
బంకురు భరత్‌కుమార్	గజపతినగరం	74	516
అల్లు హేమంత్	విజయనగరం	75	521
పువ్వల రేవంత్ సాయి	మెట్టవలస	77	535
మరడాన భానుప్రకాశ్	పార్వతీపురం	96	703
దాకి మాధవరావు	గజపతినగరం	130	889
యూ.ఆర్యవర్ధన్ నాయుడు	పార్వతీపురం	146	962
పిల్లా సృజన్‌నారాయణ	విజయనగరం	152	996
బక్కు కావ్య	బక్కుపేట	255	1618
రాగాల అఖిల్	చీపురుపల్లి	211	1343
సతివాడ కార్తీక్	రాజాం డోలపేట	161	1056
కనకల జశ్వంత్‌కుమార్	పురిటిపెంట	104	729
బి. గణేష్‌కుమార్	పురిటిపెంట	--	1503
పొట్ట నిశ్వంత్	గజపతినగరం	--	122
దేవుబార్కి రేవంత్ ఈశ్వర్	కన్నంపేట	37(ఎస్సీ కేటగిరీ)	1988
దేవుబార్కి పుష్యమిత్ర	బొబ్బిలి	151	6389
పి.ఉపేంద్ర	--	1256(ఎస్టీ కేటగిరీ)	--
ఎ.ప్రశాంత్	--	1441	--
బి.మంగయ్య	--	1516	--
ఎస్.శ్రీజ	--	3526	--


మజ్జి రిషివర్ధన్


ధనుకొండ శ్రీనిధి


అల్లు హేమంత్


మరదాన భానుప్రకాశ్


బి.భరత్‌కుమార్


డి.మాధవరావు


కనకల జశ్వంత్


రాగాల అఖిల్


సతివాడ కార్తీక్.


బి.గణేష్ కుమార్


పొట్ట నిశ్వంత్

విజయనగరం అర్బన్: దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ – 2024 ప్రవేశ పరీక్షలో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు మంచి ర్యాంక్‌లు సాధించారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన ఎం.సాయిశివాలోచన్‌కు జాతీయ స్థాయిలో 165 ర్యాంక్, పట్టణంలోని పూల్‌బాగ్ కాలనీకి చెందిన ధనుకొండ శ్రీనిధికి జాతీయ స్థాయిలో 326, పట్టణంలోని కంటోన్మెంట్‌కు చెందిన కోరాడ జయవర్ధన్‌కు జాతీయ స్థాయిలో 879 ర్యాంక్ లభించాయి. అలాగే సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో నిర్వహిస్తున్న ఐఐటీ సూపర్ 60 కోచింగ్‌లో నలుగురు గిరిజన విద్యార్థులకు ఎస్టీ కేటగిరీలో మంచి ర్యాంకులు వచ్చాయి.

సేంద్రియ సాగే.. అందరి బాగు

● ఆరోగ్యకరమైన పంటల దిగుబడి
● మార్కెట్‌లో మంచి గిరాకీ
● మక్కువ చూపిస్తున్న రైతులు, వినియోగదారులు



గోవిందపురంలో సేంద్రియసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



చౌడువాడలో సేంద్రియసాగులో మిరప, అరటి పంటలు వేసిన రైతులు

పూసపాటిరేగ: సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన దిగుబడుల కు ఎగుమతి అవకాశాలతో పాటు అధిక డిమాండ్ ఉంటుంది. రసాయనాలకు స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా నేలసారం పెంచడంతో పాటు ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చునని రైతులు గుర్తించారు. ప్రకృతిలో దొరికే ఆకులు, కషాయాలను వాడుతూ పండించే పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ లభిస్తోంది. జిల్లాలో సుమారు 20 వేల ఎకరాల్లో సేంద్రియ సాగు జరుగుతోంది. అత్యధికంగా మామిడి, జా మ, వివిధ రకాల కూరగాయలను సేంద్రియ పద్ధతిలో రైతులు సాగు చేస్తున్నారు. మార్కెట్‌లో నిగని గలాడుతూ కనిపిస్తున్న మామిడి వంటి పండ్లు మందులు వేసి ముగ్గపెట్టడంతో పరిపక్వం చెందకుండా విక్రయిస్తుండడంతో వాటిని కొని తింటున్న ప్రజ లు అనారోగ్యం బారిన పడుతున్నారు. పూసపాటిరే గ, డెంకాడ, నెల్లిమర్ల రామభద్రపురం, గంట్యాడ, జామి, బొండపల్లి మండలాల్లో అత్యధికంగా సేంద్రియ సాగు జరుగుతోంది. సేంద్రియ సాగులో పంటలతో పాటు కూరగాయలకు అధికంగా డిమాండ్ ఉంది. ముందుగానే ఆయా పంటలకు రైతులకు అడ్వాన్స్‌లు ఇచ్చి కొనుగోలు చేసుకుంటున్నారు. ఇప్పటికే ప్రకృతి వ్యవసాయంపై జిల్లాలో అన్ని మండలాల రైతులకు అవగాహన కల్పించి సేంద్రియ సాగును ప్రోత్సహిస్తున్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయంపై రైతు భరోసా కేంద్రాల్లో సలహాలు అందిస్తూ ప్రోత్సహించడం ద్వారా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఎరువులు, పురుగు మందు ల ఖర్చు లేకుండానే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పురు గు మందులకు స్వస్తి పలికి పంచగవ్య, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, నీమాస్త్రం , ఘనజీవామృతం, ద్రవజీవామృతం, కంపోస్టు, వేపపిండి, జనుములాంటివి ఎరువుగా సేంద్రియ వ్యవసాయంలో వినియోగిస్తున్నారు.

సేంద్రియసాగులో ఖర్చు తక్కువ

సేంద్రియ సాగులో వేసిన పంటలకు పెట్టుబడి ఖర్చు తక్కువ. దిగుబడి ఎక్కువగా వస్తుంది. సేంద్రియ సాగులో వేసిన కూరగాయలకు మంచి డిమాండ్ ఉంది. నా సొంత పొలంలో 50 సెంట్లలో సేంద్రియ సాగులో వేసిన కూరగాయలకు మంచి ధర పలికింది.

పి. రామకృష్ణ, రైతు గోవిందపురం

భూసారానికి రక్ష

సేంద్రియసాగు ద్వారా భూమి సారం కోల్పోదు. ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తాయి. సేంద్రియ సాగులో భూసారం పెంచే వానపాములు తయరవుతాయి. ఈ సాగులో పండిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఈ పద్ధతిలో పండించే పంటలు తినడం ఆరోగ్యకరంగా ఉంటుంది.

కె.నీలిమ, మండల వ్యవసాయ అధికారి, పూసపాటిరేగ

కనులపండువగా సీతారాముల కల్యాణం



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: మండలంలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం కనులపండువగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు చాణక్య, జీఎస్ హర్ష ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు స్వామివారికి స్నపనం, పంచామృతాభిషేకాలు, సహస్రనామ కుంకుమార్చన చేపట్టారు. అనంతరం వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, పద్మశ్రీ, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఏవీ రమణ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై లిఫ్ట్ ఇచ్చి చాకుతో దాడి

● దేవరాపల్లిలో యువకుడికి గాయాలు
● నగదు, సెల్‌ఫోన్‌తో గుర్తు తెలియని వ్యక్తుల పరారీ



కె. కోటపాడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీను

దేవరాపల్లి: తెల్లవారుజామున బస్సులు, ఇతర వాహనాలు లేకపోవడంతో లిఫ్ట్ అడిగిన పాపానికి ఓ యువకుడిపై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు చాకుతో దాడి చేశారు. అతడి వద్ద రూ.5 వేలతో పర్సును, సెల్‌ఫోన్‌ను ఎత్తుకుపోయారు. దేవరాపల్లిలో ఆదివారం వేకువ జామున 5 గంటల ప్రాంతంలో ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా ఎస్. కోట మండలం వెంకటరమణపేటకు చెందిన జవ్వాది శ్రీను(32) విశాఖ నుంచి దేవరాపల్లిలో తన అత్తవారింటికి శనివారం రాత్రి బయలుదేరి వెళ్లాడు. కొత్తవలస వరకు బస్సులోను, అక్కడ నుంచి వావిలపాడు జంక్షన్ వరకు క్వారీ లారీ మీద చేరుకున్నాడు. అక్కడ ఏ వాహనం దొరక్కపోవడంతో దేవరాపల్లికి నడుచుకుంటూ బయలుదేరాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై దేవరాపల్లి వైపు వస్తుండగా, వారిని ఆపి తీసుకెళ్లాలని కోరాడు. అతడిని ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని దేవరాపల్లిలో దించకుండా శారదా నది వంతెన వైపు నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ అతడి జేబులో పర్సు, సెల్‌ఫోను ఇవ్వకపోతే చంపేస్తామంటూ చాకుతో బెదిరించారు. దీంతో భయబడిన శ్రీను రూ.5 వేలతో పర్సు ఇచ్చేసి, సెల్‌ఫోన్ ఇవ్వడానికి నిరాకరించాడు. దీంతో రెచ్చిపోయిన యువకులు అతనిపై చాకుతో దాడికి దిగారు. ఈ దాడిలో శ్రీను చేతి వేళ్లు, తలతోపాటు శరీరంలో పలు చోట్ల విచక్షణా రహితంగా తీవ్రంగా గాయపర్చారు. దాంతో సెల్‌ఫోను వారికిచ్చేసి ప్రాణభయంతో పరుగులు తీశాడు. అయినా అతడిని వెంబడించడంతో వంతెన దగ్గరలో ఇటుక బట్టీలు వద్దకు చేరుకుని, పెద్దగా కేకలు వేయడంతో అక్కడ వారంతా నిద్రలేచి చూసేసరికి దాడికి పాల్పడిన యువకులు పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన శ్రీనును దేవరాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కె. కోటపాడు ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎస్ఐ డి. నాగేంద్ర కేసు నమోదు చేశారు. ఈ దాడికి పాల్పడిన వారి గురించి ఆరా తీస్తున్నామన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



బుడ్డేపు వెంకటేష్ (ఫైల్)

భోగాపురం: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం మండలంలోని సవరవిల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని సంతకవిటి మండలం సిరిపురం గ్రామానికి చెందిన బుడ్డెపు వెంకటేష్‌కు (33) రెండు సంవత్సరాల కిందట విశాఖపట్నం జిల్లా పెద్దవాల్తేరు గ్రామానికి చెందిన శ్రీలేఖతో వివాహం జరిగింది. ఉద్యోగరిత్యా భార్యాభర్తలిద్దరూ హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. అయితే వెంకటేష్ బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతుండడంతో పది రోజుల కిందట విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించారు. ఆదివారం కుట్లు విప్పించి కారులో సిరిపురం తీసుకువస్తుండగా.. సవరవిల్లి వద్దకు వచ్చేసరికి వెంకటేష్ బహిర్భూకి వెళ్తానని చెప్పడంతో డ్రైవర్ కారు పక్కకు తీసి ఆపాడు. ఈ క్రమంలో వెంకటేష్ రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుని తండ్రి సహదేవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి



మృతి చెందిన చింతాడ కుమారి

పార్వతీపురం టౌన్: చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దినకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కృష్ణపల్లి పంచాయతీ పార్వతీనగర్‌కు చెందిన చింతాడ కుమారి (42) భర్త చనిపోవడంతో కుమారుడుతో కలిసి కొన్నేళ్లుగా తల్లి వద్ద ఉంటోంది. అయితే తల్లితో ఎప్పటికప్పుడు తగవులవుతుంటాయి. ఈక్రమంలో శుక్రవారం కూడా ఇద్దరి మధ్య గొడవ జరగడంతో కుమారి ఇంటిలో ఉన్న ఫినాయిల్ తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి కుమారిని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కుమారి ఆదివారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఫణి మాధవికి రాధేయ పురస్కారం



ఫణి మాధవికి పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

విజయనగరం టౌన్: ప్రముఖ కవయిత్రి తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాకు చెందిన ఫణి మాధవికి డాక్టర్ రాధేయ కవితా పురస్కారాన్ని స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఆదివారం రాత్రి అందజేశారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత 15 ఏళ్లుగా ఈ పురస్కారాన్ని రాజయ్య శిష్యులైన డాక్టర్ సుంక గోపాల్ పెళ్లూరు, సునీల్ దోర్నాదుల సిద్ధార్థలు అందజేస్తున్నారని, ఈ ఏడాది సభను విజయనగరంలో ఏర్పాటుచేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు ప్రస్తుత సాహిత్యం, పురోగతిపై ప్రసంగించారు.అవార్డు గ్రహీత మాట్లాడుతూ విద్యల నగరంలో అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. కళింగ ఆంధ్ర కవులు, రచయితలు పాల్గొన్నారు.